నిర్మాణం పూర్తయ్యేదెన్నడో?

ఏడాదిగా నిలిచిపోయిన ఉన్నికోటబస్తీ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు


అసంపూర్తిగా ఉన్నికోట బస్తీ కమ్యూనిటీహాల్

కవాడిగూడ: బస్తీలు, కాలనీలో స్థానికులు శుభకార్యాలు, సభలు, సమావేశాలు నిర్వహించేందుకు కమ్యూనిటీహాళ్లను బస్తీలు, కాలనీల్లో ప్రభుత్వం నిర్మించింది. కానీ ఉన్నికోట బస్తీకి మాత్రం ఆ యోగం లేకుండా పోయింది. ఉన్నికోట బస్తీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టాలని బస్తీవాసులు ఎమ్మెల్యే ముఠాగోపాల్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన చొరువతో ఆధునిక సామాజిక భవన నిర్మాణం కోసం గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఆధునిక సామాజిక భవన నిర్మాణం ప్రారంబించారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన పనులు నత్త నడకన కొనసాగి గతేడాదిగా నిలిచిపోయాయి. కోటి పది లక్షల నిధులతో నిర్మిస్తున్న ఉన్నికోట బస్తీ కమ్యూనిటీహాల్ నిధుల లేమితో శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది.

నిధులు లేకపోవడంతో...

◆ ఉన్నికోట బస్తీలో కమ్యూనిటీహాల్ భవనాన్ని ఆధునిక ప్రయోజనాలు కల్పించేలా, స్థానిక కాలనీ వాసులకు ఉపయోగపడేలా పనులు ప్రారంభించినప్పటికీ శ్లాబ్ లేవల్లో నిధుల కొరతతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

మందుబాబులకు అడ్డాగా...

◆ నిర్మాణంలో ఉన్న ఉన్నికోట బస్తీ కమ్యూనిటీ హాల్‌లో సాయంత్రం అయ్యిందంటే మందుబాబులు తిష్ట వేస్తున్నారని బస్తీవాసులు తెలిపారు. రెండేళ్లుగా కమ్యూనిటీహాల్ అందుబాటులోకి రాక పోవడంతో దూరప్రాంతాలకు వెళ్లిపోతున్నామని లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లలో శుభకార్యాలు చేసుకోవాల్సి వస్తోందని బస్తీ వాసులు వాపోతున్నారు. కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు విన్నవించిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



రెండేళ్ల క్రితం పనులు ప్రారంభమైన ఉన్నికోట బస్తీ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు ఏడాదిగా నిలిచిపోయాయి. ఈ విషయం పట్ల జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. కమ్యూనిటీహాల్‌ను వీలైనంత త్వరగా స్థానిక బస్తీవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తా.

– జి.రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

ఇప్పటికైనా స్పందించాలి..



స్థానికంగా శుభకార్యాలు చేసుకోవడానికి కమ్యూనిటీ హాల్ అందుబాటులో లేక అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించాలి. కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి బస్తీవాసులకు అందుబాటులోకి తేవాలి.

– మహేందర్‌బాబు, బీజేపీ నాయకులు

అందుబాటులోకి తేవాలి..



సామాజిక ఇతర అవసరాల కోసం ఎన్నికలకు ముందు హడావిడిగా అధికారులు పనులు ప్రారంభించారు. నిర్మాణం పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కమ్యూనిటీహాల్ అందుబాటులోకి రాక స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– ప్రభాకర్, స్థానికుడు

పారిశుద్ధ్య సిబ్బందికి కిట్ల పంపిణీ


పారిశుద్ధ్య సిబ్బందికి భద్రత కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి గురువారం భద్రత కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని ప్రజలను కోరారు. చెత్త సేకరణ కోసం ఇంటింటికి వచ్చే జీహెచ్ఎంసీ సిబ్బందికి మాత్రమే చెత్తను ఇవ్వాలని సూచించారు. చెత్త సేకరణలో ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని ఆమె జీహెచ్ఎంసీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఎఫ్ఏ సోమయ్య, దేవా, నర్సయ్య, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


సుందరయ్య పార్కు నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశవ్యాప్తంగా ఈనెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సుందరయ్య పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు జి. లింగంగౌడ్, టి.నారాయణ, బి.వెంకటేష్, పి.శ్రీకాంత్, అజయ్‌బాబు, రాంరెడ్డి, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌ను కలిసిన మున్నూరు కాపు సంఘం నేతలు



కాచిగూడ: మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా సర్దార్ పుట్టం పురుషోత్తంరావు గురువారం కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావును కలిశారు. ఈ సందర్భంగా హనుమంతరావును అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్ది పెంటయ్య, కంచి సత్యనారాయణ, బుక్కా వేణుగోపాల్, కాశెట్టి ఆనంద్, ఉప్పు సత్యనారాయణ, జైహింద్, పాలినేని రామ్మోహన్ రావు, వెంకట నర్సయ్య, నేతి వెంకటేశ్వర్లు, వేణు తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


టీపీసీసీ ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన జైగౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామరావుగౌడ, మాధ సత్యంగౌడ్‌ను గురువారం తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయకుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్, బీసీ సమైక్య అధ్యక్షుడు ఎస్.దుర్గయ్య గౌడ్, నాయకులు నాగేశ్వర్‌గౌడ్, వెంకటేష్, ఐలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ అధ్యక్షుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

చిక్కడపల్లి: జై బాపు.. జై భీమ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో జరిగే కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఎల్‌బీస్టేడియంలో శుక్రవారం జరిగే బహిరంగ సభకు నియోజవర్గం నుంచి పార్టీ ముఖ్యశ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. గురువారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పై విధంగా మాట్లాడారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి


అరుంధతినగర్ బస్తీలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి నిర్ణీత కాలంలో ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ముషీరాబాద్ నియోజవర్గంలోని గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో కొనసాగుతున్న కచ్చానాలా పనులను గురువారం ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలలో వరద నీరు ఇళ్లలోకి చేరకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, రాకేష్‌కుమార్, ప్రభాకర్, డీఈ గీత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దయార మార్కెట్‌లో పర్యటన...

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ దయార మార్కెట్, బాకారం, పిండి గిర్ని గల్లీ తదితర ప్రాంతాలలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ గురువారం పర్యటించారు. వరదనీటి పైపులైన్ పనులను పర్యవేక్షించారు. పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం మోహన్‌రాజ్, జీహెచ్ఎంసీ డీఈ గీత, నాయకులు వినోద్‌సాయి, శివ, శంకర్‌ముదిరాజ్, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించడానికి కమిషన్ వేయాలి


తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేకంగా ఒక కమిషన్‌ను వేయాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనలో జరిగిన ఉద్యమంలో పాల్గొన్న వారు.. అమరుల కుటుంబాలు, జైలుకు వెళ్లిన వారి వివరాలను సేకరించి మూడు నెలలలోపు ఉద్యమకారుల లిస్టును తయారు చేసి ప్రకటించాలని కోరారు. ఉద్యమకారులకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఏ ఆకాంక్షతో రాష్ట్రం ఏర్పడిందో దానిని గుర్తించి ఉద్యమకారులను గౌరవించాలని కోరారు.

◆ ఎమ్మెల్సీ కొదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు విమలక్క, కె.గోవర్ధన్, జి.ఝాన్సీ, ప్రఫుల్ రామిరెడ్డి, మన్నారం నాగరాజు, ఆనందం, కుమారస్వామి, మోహన్ బైరాగి, గొల్లపల్లి దయానంద్, చంద్రన్న ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇనాక్ సాహిత్యం మానవీయతకు ప్రతీక


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి

చిక్కడపల్లి: కొలకలూరి ఇనాక్ సాహిత్యం మానవీయతకు ప్రతీకని ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం త్యాగరాయ గానసభలో డా.అరుణ గంధం రచించిన 'కొలకలూరి ఇనాక్ సాహిత్యం బహుముఖ తత్వం 'గ్రంథాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ... ఇనాక్ దళితవాద సాహితీ వేత్త అని... అణగారిన వర్గాల పక్షపాతి అని కొనియాడారు. తెలుగు సాహిత్యానికి మంచి కానుక అరుణ అందించిన ఇనాక్ సాహిత్యమని అభినందించారు. ఇనాక్‌కు జ్ఞానపీఠం ఇంకా రాకున్నా ఎంతో ఎత్తుకు ఎదిగిన సాహితీ ఋషి అని పేర్కొన్నారు.

బోనాల్లో భక్తులకు ఇబ్బందులు కలగొద్దు



సమావేశంలో ఎమ్మెల్యే కాలేరు, జెడ్‌సీ రవికిరణ్

అంబర్‌పేట: నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన, వాటి పరిష్కారానికి జీహెచ్ఎంసీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. గురువారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో నియోజకవర్గం అభివృద్ధిపై సమీక్షా సమావేశం జరిగింది. జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి ఆయన పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. ప్రధానంగా నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధిలో వేగం పెంచాలన్నారు. రాబోయే బోనాల పండుగనాటికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయాల వద్ద రోడ్ల ప్యాచ్ వర్క్‌లు, నాల సమస్యలు, వర్షపునీరు నిలవకుండా, పారిశుద్ధ్యం, వీధిలైట్లు వంటి ప్రధాన సమస్యలపై యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతిపాదిత పనులు పూర్తయ్యేందుకు కావాల్సిన నిధులు సకాలంలో మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం తలెత్తకుండా ఎప్పటికప్పుడు సమీక్షా చేయాలన్నారు. అలాగే వర్షాకాలంలో అత్యవసర బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతర విభాగాలతో సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీఎంసీ మారుతీదివాకర్, ఈఈ ఆశాలత, ఏఎంహెచ్ఓ డా. హేమలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ లక్ష్మణ్ జన్మదిన వేడుకలు


జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న బీజేపీ యువ నేత కోవా రాహుల్, కార్పొరేటర్ పావని, భారత్‌గౌడ్, పూసరాజు, వినయ్ తదితరులు



చిక్కడపల్లి: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ అని ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తనయుడు యువ నేత కోవా రాహుల్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా కార్పొరేటర్ పావని ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల సంక్షేమం కోసం కృషి చేస్తోందని అన్నారు. కార్పొరేటర్ పావని మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భారత్‌గౌడ్. సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, సీనియర్ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, వీఎస్టీరాజు, ఎం.ఉమేష్, పాలశ్రీను, మహమూద్, శివకుమార్, ప్రిన్సిపాల్ మేడే దేవదాస్, టీచర్లు పాల్గొన్నారు.

గ్రూప్-1 నోటిఫికేషన్‌లో బీసీలకు తగ్గిన ఉద్యోగాలు


సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్

కాచిగూడ: గ్రూప్-1 నోటిఫికేషన్‌లో బీసీలకు భారీగా ఉద్యోగాలు తగ్గాయని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్స్ అమలు, కొత్త రోస్టర్ టేబుల్ ప్రకారం ఉద్యోగాల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. గురువారం నింబోలిఅడ్డలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన 46 ఏళ్ల తరువాత 1993 నుంచి మండల్ కమిషన్ 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని రికమెండ్ స్తే అందులో సగం 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే కల్పించబడ్డాయని తెలిపారు. తెలంగాణలో ఏ కమిటీ ప్రాతిపదికన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికన చూస్తే ఈడబ్ల్యూఎస్‌లకు ఇచ్చిన రిజర్వేషన్లు చాలా ఎక్కువ అని ఆయన అన్నారు.

◆ బీసీలు జనాభాలో 52శాతం ఉంటే కేవలం 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కొత్త రోస్టర్ టేబుల్ ప్రకారం ఈడబ్ల్యూఎస్‌లకు ముందు వరుసలో పాయింట్స్ ఇచ్చుకున్నారని అన్నారు. దీని వల్ల బీసీల కన్నా ఈడబ్ల్యూఎస్‌లకు ఎక్కువ పోస్టులు కల్పించారని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలన్నారు. ఉద్యోగ అవకాశాల కోసం బీసీ యువత ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముత్యాల్‌రావు, అనిల్, ప్రదీప్‌గౌడ్, మాణిక్‌రావు, ప్రశాంత్ నిమ్కర్ తదితరులు పాల్గొన్నారు.

'సిగాచి ప్రమాదంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు'



ముషీరాబాద్: సిగాచి ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగి మూడు రోజులు దాటినా ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హన్మేష్, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యం, ఎస్.ఎల్. పద్మ అన్నారు. సిగాచి ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై ఈ ప్రతినిధి బృందం గురువారం శతగాత్రులను పరామర్శించి పరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అత్యాధునిక సాంకేతిక కలిగి ఉన్న రాజధాని ప్రాంతంలో రోజుల తరబడి సహాయక చర్యలు కొనసాగించడాన్ని తప్పుబట్టారు. మంత్రుల పరామర్శలు, ముఖ్యమంత్రి మందలింపులతోనే కాలం గడుపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇస్తున్న వివరాలు, అక్కడ ఉన్న మృతదేహాల వివరాలు సరిపోలడం లేదని అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రికి తరలించాలన్నారు. నష్ట పరిహారం పై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

కృత్రిమ మేధతో ఉద్యోగ అవకాశాలు

కాచిగూడ: ప్రస్తుత కంప్యూటర్ రంగంలో కృత్రిమమైన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో ఉద్యోగాలలో వ్యాపార రంగాలలో పెను మార్పులు సంభవిస్తున్నాయని వీబీజీ గ్లోబల్ అధ్యక్షుడు మారుతి గుప్తా అన్నారు. గురువారం మారుతి టెక్నాలజీస్ కేంద్ర కార్యాలయంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి జూలైలో ప్రారంభించనున్న శిక్షణ తరగతుల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. జూలై 15వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ, సువర్ణ, యమున, పావని శైలేష్, శ్రీకాంత్, సతీష్, సుమన్, సంతోష్, సునీల్, సారిక, సాయి బాల కృష్ణ, శ్రీధర్, విపిన్ తదితరులు పాల్గొన్నారు.

రాజాసింగ్ శివసేనలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తాం

కాచిగూడ: ఎమ్మెల్యే రాజాసింగ్‌ను శివసేన (యూబీటీ) పార్టీలోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామనని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గణేష్ గౌటే ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో హిందుత్వ పార్టీ ఏదైనా ఉంది అంటే అది ఒక్క శివసేన (యూబీటీ) మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. హిందుత్వవాదిగా రాజాసింగ్ శివసేనలో చేరితే బాగుటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీలో హిందుత్వ వాదులకు స్థానం లేదని మరోసారి రుజువైందని తెలిపారు. బీజేపీ రెడ్డిల పార్టీగా మారిపోయిందని విమర్శించారు. అక్కడ బీసీ నేతలకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ముషీరాబాద్: జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక రవాణా సమ్మెను జయప్రదం చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్-(సిఐటీయూ)ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ కోరారు. నగర కార్యదర్శి కె.అజయ్‌బాబు అధ్యక్షతన సిటీ కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌నగరంలోని రవాణా రంగ కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎల్.కోటయ్య, ఆసిఫ్, కోటి, శ్రీను, లక్ష్మణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బీసీ కులాలను మళ్లీ చేర్చొద్దు



కవాడిగూడ: ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో బీసీ జాబితా నుంచి తొలగించిన 27 బీసీ కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చొద్దని తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నేతలు డాక్టర్ భాగయ్య, గడప శ్రీహరి, అంబటి సుధాకర్, కంటి రాంచందర్ మల్లేష్, కొమురయ్యలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ బీసీ-ఏ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఆంధ్ర ప్రదేశ్‌లో తొలగించిన 27 బీసీ కులాలను తెలంగాణలో చేర్చవద్దని మంత్రిని కోరారు. ఈ మంత్రి సానుకూలంగా స్పందించి మాట్లాడుతూ.. తొలగించిన 27 కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చకుండా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బీసీ ఏ కులాలకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఏ కులాల హక్కు పరిరక్షణ సమితి నేతలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు

కంటిన్యూయేషన్ ఆర్డర్స్ జారీ చేయాలి


ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న వెంకటేష్ తదితరులు

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కంటిన్యూయేషన్ ఆర్డర్‌ను జారీ చేయాలని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కంటిన్యూయేషన్ ఆర్డర్ల సాధనకై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జె.వెంకటేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జె. కుమారస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, శాఖలలో లక్షా 40వేల మందికి పైగా ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 25 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని వారు తెలిపారు. రాష్ట్రం ఏర్పడితే తమ ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయని బతుకులు బాగుపడతాయని భావించామన్నారు.

◆ కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆశలను వమ్ము చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 20 నెలలు కావస్తున్నా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేదని వారు తెలిపారు.

◆ గత ఏప్రిల్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కంటిన్యూయేషన్ ఆర్డర్లు జారీ చేయాల్సి ఉందన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. జీఎస్టీ, పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ, పోలీస్, వైద్య, ఆరోగ్య, సివిల్ సప్లై, ఇరిగేషన్, మిషన్ భగీరథ, హయ్యర్ ఎడ్యుకేషన్ తదితర శాఖలలో ఉద్యోగులకు ఇంత వరకు వేతనాలు విడుదల చేయలేదన్నారు. జీఎస్టీ గత ఏప్రిల్ నుంచి వంద మంది ఉద్యోగులను తొలగించారని వారు ఆరోపించారు. ఉద్యోగ భద్రత బకాయి వేతనాల చెల్లింపు, సమాన పనికి సమాన వేతనం తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వై. సోమన్న, సాంబయ్య తదితరులతో పాటు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.